

పేదలకు పక్కా ఇళ్లు..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదలు పక్కాఇళ్లు నిర్మించుకుంటున్నారని రాంచందర్ నాయక్ తెలిపారు. జిల్లాకు 10,651 ఇళ్లు మంజూరు కాగా, ఇందులో 9,858 ఇళ్లకు మంజూరు పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇంది రమ్మ ఇళ్ల గ్రౌండింగ్, బిల్లుల చెల్లింపులో జిల్లా పురోగతి సాధించి ప్రభుత్వం నుంచి ప్రశంసలు పొందడం జరిగిందన్నారు.



ప్రజాపాలన దినోత్సవంలో మాట్లాడుతున్న రాంచందర్ నాయక్



కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వవిప్ జాటోతు రాంచందర్‌నాయక్

జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కృషి

'గృహజ్యోతి'తో పేదల ఇళ్లలో వెలుగులు
- ఇందిరమ్మ పథకంలో జిల్లాకు 10,651 ఇళ్లు
- అన్నదాతలకు అండగా రాష్ట్ర సర్కార్
- గ్రామ పాలనను బలోపేతం చేయడానికి జీపీవోలు
- రాష్ట్ర ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్

మహబూబాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ కృషి చేస్తోందని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ఆయన వివరించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండు పథకాలను అమలు చేసినట్లు రాంచందర్‌నాయక్ వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించామన్నారు. జిల్లాలో మహాలక్ష్మి పథకంతో 189.07 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేశారని వివరించారు. నిరుపేదలు సైతం రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యాన్ని పొందేందుకు, రాజీవ్‌ఆరోగ్యశ్రీ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. అంతే కాకుండా కొత్తగా 163 రకాల చికిత్సలను అందులో చేర్చినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ ద్వారా 17,308 మంది పేదలు చికిత్స పొందగా రూ.76.73 కోట్లు ఖర్చు చేశామని వివరించారు.



పోలీసులచే గౌరవ వందనం స్వీకరిస్తున్న రాంచందర్‌నాయక్

పేదల ఇళ్లలో వెలుగులు..

'గృహజ్యోతి' పథకం అమలుతో 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వాడే ప్రతీ ఇంటికి ఉచిత వెలుగులు పంచుతున్నామని రాంచందర్‌నాయక్ తెలిపారు. అల్పాదాయ వర్గాల వారికి కరెంట్ భారం తగ్గించి, వారి గృహాల్లో చీకట్లను పారద్రోలి విద్యుత్ కాంతులను నింపేందుకు గృహజ్యోతి పథకాన్నిఅమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1.34 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరగా, ప్రభుత్వం సుమారు రూ.53.08 కోట్ల సబ్సిడీ అంద జేయడం జరిగిందన్నారు.

రైతులకు రూ.570 కోట్ల రుణ మాఫీ

అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాంచందర్‌నాయక్ అన్నారు. ఒక్కో రైతుకు రూ.2లక్షల రుణ మాఫీ చేశామని, మహబూబాబాద్ జిల్లాలో నాలుగు విడతల్లో 65,147 మంది రైతులకు రూ.570 కోట్ల రుణ మాఫీ చేయడం చేశామన్నారు. రైతు భరోసాలో భాగంగా సంవత్సరానికి ఎకరాకు రూ.12 వేల చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. సన్నవడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించినట్లు తెలిపారు. రైతు బీమా పథకంలో భాగంగా మరణించిన రైతు కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున భీమా నగదును నామిని ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఇలా జిల్లాలో 843 రైతు కుటుంబాలకు రూ.42.15 కోట్లు చెల్లించామన్నారు.

179 మంది జీపీవోల నియామకం..

గ్రామ స్థాయిలో పాలనను బలోపేతం చేయడానికి గ్రామపాలన అధికారులను నియమించామని ప్రభుత విప్ రాంచందర్‌నాయక్ తెలిపారు. జిల్లాలో 180 క్లస్టర్లకు గాను 179 మంది అధికారులను నియమించామన్నారు. జిల్లాలో 31,052 కొత్త రేషన్ కార్డులు అందించడంతో పాటు (మిగతా 8వ పేజీలో)



మరిపెడ విశ్రాంతి భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

జిల్లా యంత్రాంగం.. యూరియా పంపిణీపై ఫోకస్ పెట్టాలి

రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మరిపెడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా యంత్రాంగమంతా యూరియా పంపిణీపై ఫోకస్ పెట్టాలని రెవెన్యూ, గృహ నిర్మాణల శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌తో కలిసి మరిపెడ విశ్రాంతి భవన్‌లో స్థానిక అధికారులతో యూరియా పంపిణీపై పొంగులేటి సమీక్ష జరిపారు. అనంతరం ఆయన మరిపెడలో విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర రైతుల కోసం యూరియా సమకూర్చుతున్నారని గుర్తు చేశారు. రైతులు యూరియా కోసం ఆందోళనలకు గురికావొద్దని సూచించారు. యూరియాను బ్లాక్‌చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏడీఏ విజయ్ చందర్, మరిపెడ తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, మండల్ పరిషత్ ప్రత్యేకాధికారి శ్రీమన్నారాయణరెడ్డి, ఆర్ఐ శరత్, ఏవో వీరాసింగ్, కేసముద్రం వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఐలిమల్లు, అభినవ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పెండ్లీ రఘువీర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంబరీశ, మరిపెడ పట్టణ అధ్యక్షుడు తాజిద్దీన్, అప్జల్, అప్సర్, రవినాయక్, రవికాంత్ పాల్గొన్నారు.



సంద్రాలగూడెం జీపీ కార్యాలయానికి తాళం వేస్తున్న ఇంటి యజమాని

అద్దె ఇవ్వలేదని జీపీకి తాళం

సంద్రాలగూడెంలో ఘటన 8

జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



ఉద్యోగులను అభినందిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి ఆలిండియా సివిల్ సర్వీసెస్ క్రీడల్లో రాణించి, మహబూబాబాద్ జిల్లాకు పేరు తీసుకురావాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జాతీయస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడలకు ఎంపికైన ఉద్యోగులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ప్రైజ్‌లను తీసుకురావాలని సూచించారు.

జిల్లా యువజన క్రీడల అధికారి జ్యోతి మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈ నెల 9,10 తేదీల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ గేమ్స్‌లో జిల్లాకు చెందిన పలుశాఖల ఉద్యోగులు జాతీయస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. 100 మీటర్ల పరుగుపందెంలో జ్ఞానేశ్వరి, షాట్‌పుట్‌లో రవీందర్, 100 మీటర్ల పరుగుపందెం ఓపెన్ కేటగిరిలో అనితలు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. బాస్కెట్ బాల్‌లో శ్రీనివాస్, మంజూర్, సునిత, ప్రవీణ్, డిస్కస్‌త్రోలో రవీందర్, షటిల్ బ్యాడ్మింటన్‌లో శైలజ, కబడ్డీలో మాధవి, శారద, సరిత, ఖో-ఖోలో దివ్యభారతి, రెజ్లింగ్‌లో జ్యోతి, వాలీబాల్‌లో కవిత, స్విమ్మింగ్‌లో వి.ఎస్. శ్రీనివాస్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగించాలి

- 10 లక్షల ఎకరాల భూమిని పంచిన ఘనత కమ్యూనిస్టులది
- దేశంలో కులం, మతం పేరిట బీజేపీ రాజకీయాలు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



వార్షికోత్సవ ముగింపు సభలో ప్రసంగిస్తున్న జాన్‌వెస్లీ

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వ స్ఫూర్తితో భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని వీఆర్ఎన్ గార్డెన్స్‌లో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ ముగింపు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యవక్తగా హాజరైన ఆయన ప్రసంగించారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న 25 లక్షల సర్కారు భూమిని పేదలకు పంచకుండా ప్రజాపాలన అంటే ఎలా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పోరాటాల ద్వారా పేదలకు 10 లక్షల ఎకరాలను పంచిన ఘనత కమ్యూనిస్టులదేనని ఆయన చెప్పారు.

దోపిడీ వర్గాలకు కొమ్ముకాస్తున్న బీజేపీ

దేశంలో కులం, మతం పేరిట బీజేపీ రాజకీయాలు చేస్తుందని జాన్‌వెస్లీ విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకివచ్చాక మైనార్టీలు, మహిళలపై దాడులు, అత్యాచారాలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆరోపించారు. దోపిడి వర్గాలకు బీజేపీ కొమ్ముకాస్తుందని విమర్శించారు. తెలంగాణ రైతాం గ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ప్రజాఉద్యమాలకు శ్రీకారం చుట్టాలన్నారు. తెలంగాణ రైతాంగ పోరాటంలో 4 వేల మంది అమరులయ్యారన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

తెలంగాణలో ఇష్టారీతిన హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని జాన్‌వెస్లీ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే లక్ష ఉద్యోగాలు ఇస్తామని చెప్పి రెండేళ్లు కావస్తున్నా.. వాటిని భర్తీ చేయలేదని ఆరోపించారు. పేదలు ఇంటి స్థలం కోసం పోరాటాలు నిర్వహిస్తున్న ప్రభుత్వం వారికి స్థలాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాగా, తొలుత మానుకోట పట్టణంలోని ఫాతిమా హైస్కూల్ నుంచి పురవీధుల గుండా వీఆర్ఎన్ గార్డెన్స్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, ఆకుల రాజు, శెట్టి వెంకన్న, గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య, కుంట ఉపేందర్, కందునూరి శ్రీనివాస్, బానోత్ సీతారాంనాయక్, సమ్మెట రాజమౌళి, రావుల రాజు, మండ రాజన్న, గాడిపెల్లి ప్రమీల, అశోక్, మోహన్, మార్తినేని పాపారావు, దుడ్డెల రాంమూర్తి, శాగంటి భాగ్యమ్మ, కుమ్మరికుంట్ల నాగన్న, గునిగంటి మోహన్ పాల్గొన్నారు.

మా భూములకు పట్టా చేయాలి

తహసీల్దార్‌కు రైతుల వినతి

గూడూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాజన్‌పల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 127/53, 127/56లో 338 ఎకరాలకు పైగా వ్యవసాయా భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని, తమకు పట్టాలు అందించి ఆదుకోవాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్‌లు దారావత్ బాలు నాయక్, దారావత్ కస్నానాయక్ కోరారు. ఈ మేరకు గూడూరు తహసీల్దార్ నాగభవానికి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1986 నుంచి ఆ భూమిని సాగు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. 115మంది రైతులు 338 ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నట్లు చెప్పారు. గతంలో ఈ భూములపై అధికారులు సర్వే చేసినట్లు పేర్కొన్నారు. కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ వరకు వెళ్లి వారివద్ద తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని వేడుకున్నట్లు చెప్పారు. సదరు భూములకు పట్టాలివ్వకపోవడంతో రైతులకు పంట రుణాలు, రైతుబీమా, యూరియా బస్తాలు, ఇతరత్రా ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు ఈరు, రాజు, మోహన్, గణేష్, లాల్యా, రవి, హేమ్లు, మంగ్యా, భద్రు తదితరులు పాల్గొన్నారు.

రాధమ్మ హత్య కేసును ఛేదించిన పోలీసులు

- బంగారం కోసం చంపినట్లు తొలుత కేసు నమోదు
- మంత్రాల నెపంతో హత్య చేశామని అంగీకరించిన నిందితులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కృష్ణకిషోర్



హత్యకేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణకిషోర్

నెల్లికుదురు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఈనెల 12న జరిగిన వీరగానికి రాధమ్మ హత్య కేసును పోలీస్‌లు ఛేదించారు. కాగా, ఆమెను బంగారం కోసం హత్యచేసి బావిలో పడేశారని భావించి, పోలీస్‌లు తొలుత కేసు నమోదు చేశారు. ఆమె హత్య జరిగిన అనంతరం మూడురోజుల పాటు పోలీస్‌లు సమాచారం సేకరించి, నిందితులను పట్టుకొని విచారించారు. మంత్రాల నెపంతో రాధమ్మను హత్యచేశామని నిందితులు అంగీకరించారు. నెల్లికుదురు ఠాణాలో హత్యకు పాల్పడిన ఇద్దరితో పాటు సహకరించిన మరొకరిని బుధవారం అరెస్ట్ చేశారు. హత్యకేసు వివరాలను తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్ వెల్లడించారు.

నెల్లికుదురు మండల కేంద్రానికి చెందిన వీరగాని రాధమ్మ (80) భర్త హుస్సేన్ పదేళ్ల క్రితం చనిపోయాడు. వారికి ముగ్గురు కుమారులుకాగా, వారు వేరే ప్రాంతాలకు బతుకు దెరువు కోసం వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఆమె జీవిస్తూ ఉంటుంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన44 ఏళ్ల వీరగాని ఉప్పలయ్య, అలియాస్ ఉపేందర్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రాధమ్మ మంత్రాలు చేయడంతోనే అనారోగ్యానికి గురిఅవుతున్నాననే అనుమానంతో ఆమెను హత్యచేయాలని భావించాడు. ఈ విషయాన్ని ఉపేందర్ తన సోదరుడు మహేష్‌తో చెప్పాడు. అందుకు అతనూ అంగీకరించాడు. ఇద్దరు కలసి ఈ నెల 12న రాత్రి 11గంటల సమయంలో ఇనుపరాడ్డు పట్టుకొని రాధమ్మ ఇంటికి వెళ్లి గుడుంబా కావాలని తలుపు కొట్టారు. వెంటనే ఆమె తలుపులు తీసి బయటకు వచ్చింది. ఉపేందర్ రాడ్డుతో రాధమ్మ తలపై కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందింది. శవాన్ని ఇంటి ముందు ఉన్న బావిలో పడేశారు. హత్య అనంతరం బయటకు వచ్చి పారిపోవడానికి మహేష్ తన స్నేహితుడైన దువ్వరాజును బైక్ తీసుకోనిరావాలని ఫోన్‌చేయగా ఆయన అక్కడికి చేరుకొని ఉప్పలయ్యను, మహేష్‌ను బ్రాహ్మణకొత్తపెల్లి ఆకేరు వద్దకు (మిగతా 8వ పేజీలో)

ఐదు సహకార సంఘాలు రద్దు

- ప్రత్యేక అధికారుల నియామకం
- 13 సంఘాలకు పదవీకాలం పొడిగింపు



కురవి మండలకేంద్రంలో ఎఫ్ఏసీఎస్ కార్యాలయం

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాల చట్టం జీవో 386 ప్రకారం.. ప్రభుత్వ నియమ నిబంధనలు (పారా మీటర్లు)కు లోబడి సక్రమంగా పనిచేయని మహబూబాబాద్ జిల్లాలోని ఐదు సహకార సంఘాలను (నాలుగు పీఏసీఎస్‌లు, ఒక ఎఫ్ఏసీఎస్) కలుపుకుని రద్దు చేశారు. ఆ సంఘాల కమిటీల స్థానంలో ప్రత్యేక అధికారులను ఇన్‌చార్జిలుగా నియమిస్తూ మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర సహకార సంఘం కమిషనర్ రిజిస్ట్రార్ నుంచి ఆదేశాలు రావడంతో జిల్లా సహకార సంఘం అధికారి వెంకటేశ్వర్లు బుధవారం స్పష్టం చేశారు. జిల్లాలోని తొర్రూరు, కేసముద్రం, నెల్లికుదురు, బయ్యారం మండలాల్లోని సహకారం సంఘాలు (పీఏసీఎస్)లు, కురవిలోని ఫార్మర్ సర్వీస్ కోఆపరేటివ్ సొసైటీ (ఎఫ్ఏసీఎస్)లను రద్దు పరిచారు. తొర్రూరు పీఏసీఎస్‌కు అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా కె.రమేష్, కురవి డి.సుమలత, కేసముద్రంకు ఎం.ప్రవీణ్, నెల్లికుదురుకు ఎం.మనోహర్‌రావు, బయ్యారంకు ఆదినారాయణను ఇన్‌చార్జిగా నియమిస్తూ జిల్లా సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అధికారులు మంగళవారం రాత్రే తమ స్థానాల్లో బాధ్యతలు చేపట్టారు. సహకార సంఘాల చైర్మన్లు, కమిటీల పదవీకాలం 14-02-2025 వరకే ముగిసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడగించారు. ఆ పదవీకాలం కూడ గత ఆగస్టు 14తో ముగిసింది. మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడగించారు. దీంతో మహబూబాబాద్ జిల్లాలోని ధనసరి, మహబూబాబాద్, మరిపెడ, నర్సింహులపేట, ఎర్రబెల్లిగూడెం, శ్రీరామగిరి, కాంపెల్లి, మన్నెగూడెం, గార్ల, గుండ్రాతిమడుగు, గూడూరు, పొగుళ్లపల్లి, డోర్నకల్ మండలాల్లో సహకార సంఘాలను రాష్ట్ర ప్రభుత్వం పొడగించింది. కాగా, తొర్రూరు సహకార సంఘంలో గతంలో పెట్రోల్ పంప్ ఏర్పాటుకు భారీగా ఖర్చు చేయడం, అది సక్రమంగా నడవకపోవడంతో, పంట రుణాలు సక్రమంగా రికవరీ చేయలేదు. ఆ సంఘం నష్టపోయింది. అంతేకాకుండా మిగతా సహకార సంఘాలపై పలు ఆరోపణలు వచ్చాయి. కేసముద్రం సహకారం సంఘంలో మొక్కజొన్నల కొనుగోలుపై విచారణ జరిపినట్లు తెలిసింది.

23న నరేశ్‌రెడ్డి విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న పురుషోత్తమాయగూడెం మాజీ సర్పంచ్ అభినవ్‌రెడ్డి

మరిపెడ రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 23న ప్రజా నాయకుడు, దివంగత నూకల నరేశ్‌రెడ్డి విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలని పురుషోత్తమాయగూడెం మాజీ సర్పంచ్ నూకల అభినవ్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని పురుషోత్తమాయగూడెం ఏరువాక వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో నూకల నరేశ్‌రెడ్డికి ప్రజలలో ఘనమైన పేరుందని, రాజకీయ పదవి మాత్రం రాలేదన్నారు. తాను ఇక నుంచి శాశ్వతంగా రాజకీయాల్లో కొనసాగుతానన్నారు. ఏరువాక వ్యవసాయ క్షేత్రానికి నియోజకవర్గ ప్రజలందరూ హాజరుకావాలని కోరారు. విగ్రహావిష్కరణకు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నూకల అనిరిద్దురెడ్డి, గుండగాని సుందర్‌గౌడ్, మరిపెడ మాజీ సర్పంచ్ పానుగోతు రాంలాల్, మాజీ ఎంపీటీసీ గంధశిరి అంబరీష, కాలం రవీందర్‌రెడ్డి, బండి వెంకటరెడ్డి, రామునాయక్, సంపెట రాము, గడ్డం వెంకటరెడ్డి, మూల మురళీధర్‌రెడ్డి, యార్ల మురళీధర్‌రెడ్డి, మెంచు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో లొల్లి..

● కండక్టర్, ప్రయాణికురాలు మధ్య తోపులాట


కండక్టర్, ప్రయాణికురాలు మధ్య జరుగుతున్న లొల్లి

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో లొల్లి నెలకొన్నది. ప్రయాణికురాలు, కండక్టర్ మధ్య మటామాట పెరిగి తోపులాట వరకు చేరింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మధ్యాహ్నం 4 గంటల సమయంలో మానుకోటలోని తొర్రూరు బస్టాండ్‌లో తొర్రూరుకు బయలుదేరేందుకు సిద్ధమైంది. బస్సు సీటులో కూర్చున ఓ ప్రయాణికురాలు పక్కన పురుగుమందు పిచికారి చేసే పంపు సీటులో పక్కన పెట్టుకున్నట్లు తెలిపారు. తోటి ప్రయాణికులకు ఇబ్బంది ఉన్నదని, పంపు సీటులో నుంచి తీసి పక్కన పెట్టమనగా బాధిత ప్రయాణికురాలు కండక్టర్‌పై దురుసుగా వ్యవహరించడంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి తొపులాట జరిగింది. దీంతో ఇరు వర్గాలు స్థానిక టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. పోలీసు అధికారులు బస్సు కండక్టర్, ప్రయాణికురాలుకు సర్ధి చెప్పి పంపించారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

● ప్రభుత్వవిప్ రాంచంద్రునాయక్


మెగా వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్య పరిరక్షణే రాష్ట్ర సర్కార్ ధ్యేయమని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనంలో స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మెగా హెల్త్ క్యాంపును కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌తో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురష్కరించుకొని మహిళల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు దేశ వ్యాప్తంగా అమలు చేయనున్న కార్యక్రమాన్ని వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించి, వైద్య శిబిరాలల్లో పొందిన సేవల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు.

జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ పథకాన్ని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరాలల్లో ప్రసూతి వైద్యం, చిన్న పిల్లలకు ఆరోగ్య పరీక్షలు, కంటి, దంత, సైకియాట్రి, డెర్మటాలజీతో పాటు మహిళలకు హిమోగ్లోబిన్ పరీక్షలు, రక్తపోటు, మధుమేహం, కాన్సర్, టీబీ స్క్రీనింగ్, గర్భిణీలకు అవసరమయ్యే పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వైద్యులు వైద్య సేవలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం ఈ మెగా వైద్య శిబిరంలో 371 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్‌టొప్పో, రెవెన్యూ అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్, డీఎంఅండ్‌హెచ్‌వో రవిరాథోడ్, డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ చింత రమేష్, జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరంటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ వెంకట్, ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విరాట్ విశ్వకర్మ చూపిన భక్తిమార్గాన్ని అనుసరించాలి

● జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి నరసింహస్వామి


శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విరాట్ విశ్వకర్మ చూపిన భక్తిమార్గం అనుసరించి ప్రశాంతమైన జీవనం కొనసాగించాలని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి నరసింహస్వామి అన్నారు. మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ కార్యాలయంలో బుధవారం జ్యోతి ప్రజ్వళన చేసి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించి, విశ్వకర్మ యజ్ఞమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహస్వామి మాట్లాడుతూ...విశ్వకర్మ పరమేశ్వరుని యజ్ఞము జరుపుకోవడం వలన ప్రపంచశాంతికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ అసోసియేషన్ బాధ్యులు ఆరేంద్ర వెంకటేశ్వర్లు, వంగాల సోమనర్సయ్యాచారి, వెంకట్రాజచారి, శంకర్, కృపాకరాచారి, సత్యమనోరమ, కనకాచారి, పమ్మి సనాతనాచారి, పూర్ణాచారి, వెంకన్న పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో..

జిల్లా కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ప్రధానఅర్చకులు తాటిపాముల శివకృష్ణమాచారి వేదమంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు చేసి విరాట్ విశ్వకర్మ పరమేశ్వర యజ్ఞ మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు చైర్మన్ సమ్మి సనాతనాచారి-అనురాధ, నేలకొండ నాగమణి-ఈశ్వరాచారి, మాధవాచారి, లక్ష్మణాచారి, సోమయ్య, రాజమౌళి, పూర్ణచందర్, సోమేశ్వరచారి, సుదర్శనచారి, నాగేశ్వరచారి, ప్రశాంత్, రాజేష్, హరికృష్ణ, హరికిషన్, సతీష్, వీరబద్రాచారి, చిరంజీవాచారి, రత్నమాచారి, ఉపేంద్రాచారి, మోహనాచారి పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు


రక్తదానం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేసి మరొకరి ప్రాణ దాత కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు అన్నారు. దేశ ప్రధాని మోడీ 75వ జన్మదినం పురష్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో రక్తదాన శిభిరం ఏర్పాటు చేశారు. 90 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్ని దానాల్లోకల్లా రక్తదానం గొప్పదన్నారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి రక్తదానం ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దిరాజు రామచందర్‌రావు, క్యాచ్‌వల్ శ్యాంసుందర్‌శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శులు మహేష్‌గౌడ్, అశోక్, మదన్‌లాల్, వెంకన్న, నర్సింహారెడ్డి, పద్మావతి, ఇందు భారతి, రాంబాబు, ప్రేమ్‌రాయుడు, బాలు, సందీప్, డాక్టర్ రవీందర్ నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా మోదీ పుట్టిన రోజు వేడుకలు


పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

కేసముద్రం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేసముద్రంలో బుధవారం ప్రధాని మోదీ పుట్టినరోజును బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి బోగోజు నాగేశ్వరాచారి మాట్లాడుతూ దేశం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన నేత ప్రధాని మోదీ అని అన్నారు. దేశ ప్రగతికి, ప్రజా సంక్షేమానికి నిరంతరంగా కృషి చేస్తున్న మోదీలాంటి నాయకుడు దొరకడం మన అదృష్టమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పొదిల నర్సింహారెడ్డి, రామడుగు వెంకటాచారి, నాగరబోయిన చంద్రకళ, బోనగిరి ఉపెందర్, లెంకలపల్లి శ్రీనివాస్, బచ్చు లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత


రోడ్డుపైనున్న గుంతలను పూడ్చివేయిస్తున్న చైర్మన్ గంట సంజీవరెడ్డి, ఎస్ఐ మురళీధర్‌రాజ్

కేసముద్రం, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం విలేజి నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు రోడ్డుపై గుంతలతో కొద్ది రోజులుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి చొరవతో బుధవారం గుంతల పూడ్చివేత కార్యక్రమం ప్రారంభించారు. ఆర్‌అండ్‌బీ అధికారుల ఆధ్వర్యంలో గుంతల్లో కంకర పోయించి పూడ్చివేయిస్తున్నారు. ఎట్టకేలకు గుంతలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కొంత ఉపశమనం లభించడంపట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నరేంద్ర మోదీ నాయకత్వం దేశానికి ఆదర్శం

● బీజేపీ రాష్ట్ర నాయకుడు రాంమెహన్‌రెడ్డి

తొర్రూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : నరేంద్ర మోదీ నాయకత్వం దేశానికి ఆదర్శమని బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగా రాంమెహన్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బుధవారం తొర్రూరులో నిర్వహించి న వేడుకల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు ఈ రోజు విమోచన దినమని, నిజాం రజాకారుల పాలన అంతమై విముక్తి లభించిందన్నారు. పాలకుర్తిలో దొరల పాలన అంతమై రెండేళ్ల పూర్తికా వచ్చినా, దొరసానుల పాలన కొనసాగుతుందన్నారు. నియెజకవర్గ ప్రజలకు విముక్తి లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కార్యకర్తలు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్తదానం చేస్తున్న వారిని అభినందించారు. ప్రధాని మోదీ జీవితం దేశానికి ఎంతో ఆదర్శమన్నారు. దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తుందని తెలిపారు. సుమారు 50యూనిట్ల రక్తాన్ని సేకరించి బ్లడ్ బ్యాంకుకు అందించారు. అన్నదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేశ్, పూసల శ్రీమాన్, రాంబాబు భాస్కర్, నవీన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం


బీజేపీ కార్యాలయంలో సుష్మాస్వరాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. సీపీఐ ఆధ్వర్యంలో విలీన దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు, సీపీఎం ఆధ్వర్యంలో రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు, బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో విద్రోహ దినోత్సవాలను నిర్వహించారు.

● జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. జిల్లా పోలీస్‌శాఖ కార్యాలయంలో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 1948 సెప్టెంబరు 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో అంతర్భాగమైంద న్నారు. మునిసిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ టి.రాజేశ్వర్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, సిబ్బంది స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. డీఈ ఉపేందర్, మేనేజర్ శ్రీధర్, టీపీవో సాయిరాం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ పాల్గొన్నారు.

● సీపీఐ ఆధ్వర్యంలో విలీన దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. మూడు కొట్లసెంటర్‌లోని సాయుధ పోరాట స్ఫూర్తి చిహ్నం వద్ద నివాళులర్పించారు. సాయుధ పోరాట యోధులను, వారి కుటుంబసభ్యులను సన్మానించారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్ నుంచి మూడు కొట్ల సెంటర్ వరకు వీర తెలంగాణ స్ఫూర్తి ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, వెంకన్న, సాంబలక్ష్మి, పాండు రంగాచారి, సందీప్, రవి, శ్రావణ్, ఫాతిమా, రమేష్, లింగ్యానాయక్, శంకర్, ప్రవీణ్, రాణి, దాసు పాల్గొన్నారు.

● సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో విద్రోహ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి మైస శ్రీనివాస్ మాట్లాడారు. సెప్టెంబరు 17 విలీనం కాదు. ప్రజా పాలన కాదు.. సమైక్యత కాదు... ముమ్మాటికి విద్రోహ దినమేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో నందగిరి వెంకటేశ్వర్లు, హెచ్.లింగన్న, మురళీకృష్ణ, సత్యనారాయణ, దేవేందర్, పుల్లన్న, యాకన్న, రాకేష్, వెంకన్న, శ్రీశైలం, వీరభద్రం పాల్గొన్నారు.

● ఎన్డీ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్రోహ దినోత్సవంలో జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, మదార్, కవిత, దేవేందర్, యాకయ్య, సుమన్ పాల్గొన్నారు.


పోలీస్ శాఖ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

● బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంక టేశ్వర్లు ఎగురవేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వద్దిరాజు రాంచందర్‌రావు, క్యాచువల్‌శ్యాంసుందర్ శర్మ, చీకటి మహేష్‌గౌడ్, గడ్డం అశోక్, మదన్, నర్సింహారెడ్డి, ఇందుభారతి, రాంబాబు, పద్మావతి, సందీప్ పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి రైతులకు గాయాలు


బాధితుడిని పరామర్శిస్తున్న ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

బయ్యారం (డోర్నకల్), సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం వెళ్తా ఆటోబోల్తా పడి రైతులకు తీవ్ర గాయాలైన సంఘటన బయ్యారం మండలం కంబాలపల్లి వద్ద బుధవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గురిమిళ్లకు చెందిన రైతులు బోడ గణేష్, బోడ కిషన్, బోడ విజయ, మాలోతు మంగమ్మ, మాలోతు భీమా, మాలోతు లక్ష్మి, మాలోతు వశ్య, గలిగి సారమ్మ, మాలోతు పిట్టి, బోడ లక్ష్మి, వజ్జ సూరమ్మ, వజ్జ బుచ్చయ్యలు ఆటోలో యూరియా బస్తాలను తెచ్చుకునేందుకు ఉప్పలపాడుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కంబాలపల్లి వద్ద అదుపుతప్పి ఆటో బోల్తాపడడంతో రైతులకు తీవ్రగాయాల య్యాయి. స్థాని కులు వారిని 108 ద్వారా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బయ్యారం ఎస్సై తిరుపతి నేరుగా పోలీస్ సిబ్బందితో కలిసి వారి ఇంటికి వెళ్లి యూరియా బస్తాలను క్షత గాత్రుల కుటుంబసభ్యులకు అందించారు.

ప్రభుత్వం విఫలం..

- మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

రైతులకు సరిపడా యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. యూరియా కోసం వెళ్తా ఆటో బోల్తాపడి గాయాలై చికిత్స పొందుతున్న రైతులను మహబూబా బాద్ జిల్లా అస్పత్రిలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచిరైతులకు కష్టాలు మొదలయ్యాయని విమర్శించారు.

డోర్నకల్‌లో రక్తదాన శిబిరం

డోర్నకల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్ జైన్‌భవన్‌లో బుధవారం జైన మహిళ తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్థుల కోసం అఖిల భారతీయ జైన్ మహిళ పరిషత్ డోర్నకల్‌శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. డోర్నకల్ సీఐ చంద్రమౌళి ముఖ్య అతిథిగా హాజరై రక్తదానం చేశారు. ప్రతీ ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాట్నీ సుశీల భాయ్, కాల భారతీజైన్, వినితజైన్, మహేందర్‌కుమార్‌జైన్, సుమీర్‌చంద్‌జైన్, యశోదర్‌జైన్, సుధీర్‌పాట్నీ, రేణుకజైన్, బబితజైన్ పాల్గొన్నారు.

వైభవంగా కొత్తల పండుగ


గాంధీనగర్‌లో కొత్తల పండుగ నిర్వహిస్తున్న ఆదివాసీలు

కొత్తగూడ, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయంలో భాగంగా నిర్వహించుకునే కొత్తల పండుగ (పెద్దల పండుగ)ను కొత్తగూడలో బుధవారం వైభవంగా జరుపుకున్నారు. కొమురం భీం విగ్రహనికి పూలమాల వేశారు. గాంధీనగర్‌లోని సమ్మక్క, సారక్క, గుడి గద్దెల వద్ద కొత్తల పండుగను నిర్వహించారు. పూజారి మద్దెల రాంబాబు ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాల ఆచార కట్టు, బొట్టు ప్రకారం పూజలు చేశారు. కొత్త వెన్నులను అప్పగించి మొక్కులు చెల్లించారు. కాగా, తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఆదివాసీల, తెలంగాణ ప్రజల విముక్తి కోసం పోరాడిన రాంజీగోండు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గాంధీనగర్ దొర, పటేళ్ల మల్లెల బాబు, గ్రామస్థులు కంగాల నాగేశ్వరరావు, సిద్ధబోయిన లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్, తుడుందెబ్బ నాయకులు మల్లెల రాము, సిద్దబోయిన సంజీవ్ రావు, కుంజ నర్సింగరావు, పూనెం సందీప్ దొర, మల్లెల సారయ్య, అల్లెం జంపయ్య, రేగా రమేష్, ఆదివాసీ ఉద్యోగ సంఘం నాయకులు గుమ్మడి లక్ష్మీనారాయణ, ఏంపల్లి సమ్మయ్య, వట్టం సాయిలు పాల్గొన్నారు.

ఒకేచోట రెండు జెండాలు



బోడగుట్టతండా పాఠశాలలో జాతీయ జెండాలు ఎగురవేస్తున్న పంచాయతీ కార్యదర్శి నివాస్, హెచ్‌ఎం యాదగిరి

కేసముద్రం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలంలోని పీక్లాతండా గ్రామం బోడగుట్టతండ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా పక్కపక్కనే రెండు జాతీయ జెండాలు ఎగురవేశారు. ఈ తండాలో జీపీ భవనం లేకపోవడంతో తాత్కాలికంగా స్థానిక పాఠశాలలోని ఒక గదిలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. దీంతో ఉదయం జీపీ కార్యదర్శి నివాస్, హెచ్‌ఎం గనె యాదగిరి జాతీయ పతాకాలను వేర్వేరుగా పక్కపక్కనే ఒకేసారి ఆవిష్కరించడం భిన్నంగా కనిపించింది.

ఉమ్మడి జిల్లాలో ప్రజాపాలన దినోత్సవం


వరంగల్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి కొండా సురేఖ


ములుగు కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేస్తున్న మంత్రి సీతక్క


మహబూబాబాద్‌లో తెలంగాణ గీతాన్ని ఆలపిస్తున్న రాంచందర్‌నాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్


హనుమకొండలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి పొంగులేటి తదితరులు



జనగామలోని కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, వేదికపై అధికారులు ←


భూపాలపల్లిలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఎమ్మెల్యే జీఎస్సార్, అధికారులు

కేటీఆర్.. దళారీకి వంత పాడతావా!?

- రైతులకు నష్ట పరిహారం ఇప్పించిన కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- నిజాయితీ ఉంటే ఆ దళారీని పార్టీ నుంచి బహిష్కరించండి
- మంత్రి ధనసరి సీతక్క

ములుగు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సిన్సియర్‌గా పనిచేస్తున్న ములుగు కలెక్టర్ దివాకర‌పై బీఆర్‌ఎస్ నాయకుడు అనుచిత వాఖ్యలు చేయడం సరికాదని, కేటీఆర్... మీ వెంట ఉంది రైతు ప్రయోజకులా... దళారులా అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రశ్నించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. నకిలీ విత్తనాలు వేసి నష్టపోయిన 900 మంది రైతులకు నష్ట పరిహారం ఇప్పించినందుకు కలెక్టర్ దివాకరపై ఓ దళారీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుంటే కేటీఆర్ వెకిలి నవ్వులు నవ్వుతారా.. అని మండిపడ్డారు.


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు జిల్లాలో చిన్న, సన్నకారు రైతులు ఉన్నారని, వారు దళారుల చేతుల్లో మోసపోవడంతో రూ. 3.80 కోట్లు విత్తన కంపెనీల ద్వారా కలెక్టర్ రైతులకు నష్ట పరిహారం ఇప్పించడం జరిగిందన్నారు. అయితే ఆ కంపెనీలో దళారిగా పని చేసే బీఆర్‌ఎస్ నాయకుడు నర్సింహమూర్తి కేటీఆర్ ముందుకు పోయి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కలెక్టర్‌ను రాష్ట్రంలో ఉంచొద్దని, అందుకు తన యావదాస్తిని పార్టీకి రాసిస్తానని మాట్లాడుతుంటే కేటీఆర్ వెకిలి నవ్వులు నవ్వడం సరికాదన్నారు.

ప్రైవేటు విత్తన కంపెనీ చేతుల్లో మోసపోతున్న రైతులను ఆదుకునేందుకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వ్యవసాయ శాఖ చైర్మన్ కోదండరెడ్డి, విత్తన శాఖ చైర్మన్ అన్వేష్‌రెడ్డితో కలిసి చర్చించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ దివాకరకు బాధ్యతలను అప్పగించామన్నారు. దీంతో కలెక్టర్ కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల రైతులకు నష్ట పరిహారం ఇప్పించారన్నారు. అందుకు రైతులు కలెక్టర్‌ను గొప్పవ్యక్తిగా పొగుడుతున్నారని తెలిపారు.

దళారిగా ఉన్న వ్యక్తిని వెంటబెట్టుకుని ఆయనకు భరోసా ఇవ్వడం ఏ రైతు ప్రయోజనాల కిందకు వస్తుందో కేటీఆర్ చెప్పాలని మంత్రి అన్నారు. వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెంకు వచ్చి మరణించిన రైతు కుటుంబాలను. నష్టపోయిన రైతులను కలిసి విచారించి కలెక్టర్ తప్పు చేస్తే బహిష్కరించాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. నిజంగా రైతుల పట్ల ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే నర్సింహమూర్తిని బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

పోషకాహారంతో మెరుగైన జీవనశైలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలి : మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోషకాహారంతోనే మెరుగైన జీవనశైలి అని, మారుతున్న జీవనశైలి మార్పుల కారణంగా ఎదురయ్యే ఆరోగ్య సవాళ్లను ఎదుర్కొనేందుకు పోషకాహారం తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయసీతక్క అన్నారు. బుధవారం ములుగులోని గిరిజన భవన్‌లో కేంద్ర సమాచారశాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్, పోషణ మాసోత్సవాలను ఆమె ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈనెల 17నుంచి అక్టోబరు 16వరకు జిల్లాలో నిర్వహించనున్న పోషణ మాసోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన ఆహారం, పోషణ పర్యవేక్షణపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల బరువు,ఎత్తు పరిశీలించడం, తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటుచేసి పోషకాహారం ప్రాధాన్యత గురించి వివరించాలన్నారు. కిశోర బాలికలకు వైద్యపరీక్షలు చేపట్టాలని, తల్లిపాల ప్రాధాన్యత, కిచెన్‌గార్డెన్ ఏర్పాటు, పరిశుభ్రత పాటించడం, పోషకాహారాల ప్రదర్శన ఏర్పాటుచేసి అవగాహన కల్పించాలన్నారు.

ఈ సందర్భంగా ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీధర్ మంత్రి సీతక్కకు ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా ఉత్తమమైన ఆహార ఆవశ్యకతపై వివరించారు. అనంతరం ఆమె పోషణ మాసోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. పోషకాహారంపై ఏర్పాటుచేసిన స్టాల్‌ను సందర్శించారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జిల్లా సంక్షేమ అధికారి తుల రవి, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, సీడీపీవో శిరీష, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.


అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి, కలెక్టర్, ప్రజాప్రతినిధులు

తెలంగాణ అమరవీరులకు నివాళి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ అదాలత్ జంక్షన్‌లో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు బుధవారం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాళులు అర్పించారు. మంత్రి పొంగులేటి వెంట వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతోపాటు ఇతర ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పొంగులేటికి స్వాగతం

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండకు వచ్చిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి నిట్ వద్ద బుధవారం వరంగల్ ఎంపీ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్, ప్రజాప్రతినిధులు మంత్రికి పూలమొక్క అందజేశారు.

మహనీయుల త్యాగాలు మరువలేనివి

- పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ

మామునూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్యం మన సొంతం కావడానికి మహనీయులు చేసిన త్యాగాలు మరువలేనివని మామునూరు పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ అన్నారు. బుధవారం మామునూరు పీటీసీలో ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇంజారపు పూజ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 మర్చిపోలేని ఘట్టం అని అన్నారు. అనాటి పోరాటయోధుల త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ అని కొనియాడారు. నిజాం నిరంకుశత్వం, దేశముఖ్, పటేల్, పట్వారీ వ్యవస్థల ద్వారా తెలంగాణ అణచివేతకు గురైన సందర్భంలో ఆర్య సమాజం సేవలు, కమ్యూనిస్టులు, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య లాంటి మహనీయులు పోరు సాగించారని అన్నారు. నాటి రాచరిక వ్యవస్థపై పోరాడి వేలాది మంది అమరులయ్యారని, వారి త్యాగాలు మరవకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రమేష్, భిక్షపతి, వెంకటేశ్వర రావు, సోమాని, డాక్టర్ సుధీర్, ఆర్‌ఐలు చంద్రశేఖర్, కాశీరామ్, మహేష్, నవీన్ సీఎల్‌ఐ అశోక్ కుమార్, దీపక్, నరేందర్, ఆర్‌ఎస్‌ఐలు రాజేష్, అనిల్ దశరథ్, అరుణ పీటీసీ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


జాతీయ పతాకానికి వందనం చేస్తున్న ఎస్పీ పూజ, పోలీసులు

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

- మంత్రి కొండా సురేఖ
- ఉర్సు గుట్ట వద్ద అధికారులతో సమీక్ష

కరీమాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉర్సు గుట్ట రంగలీలా మైదానంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు మైసూరును తలపించేలా విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం ఉర్సు రంగలీలా మైదానంలో కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన జిల్లా యంత్రాంగం, జీడబ్ల్యూఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, కలెక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆడపడుచులు ఎంతో భక్తి శ్రద్ధలతో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా బతుకమ్మ సంబరాలను జరుపుకుంటారని అన్నారు. వారి సౌకర్యార్థం ఉర్సు రంగలీలా మైదానంతో పాటు అన్ని ప్రాంతాల్లో మైదానాన్ని చదునుచేసి, రహదారిపై గుంతలు పూడ్చాలని, డస్టింగ్, లైటింగ్, కలరింగ్, తాగునీటి సౌకర్యం తదితర మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా బతుకమ్మల నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చెరువులో ఉన్న గుర్రపుడెక్కను తొలగించాలని అన్నారు. బతుకమ్మ ఆట స్థలాలను ప్రతీరోజు శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

దసరా పర్వదినం సందర్భంగా రంగలీలా మైదానంలో లైటింగ్, పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, సీటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భారీ పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల ఏర్పాటు, నిరంతర విద్యుత్ సరఫరా, ఆర్టీసీ బస్సుల ఏర్పాటు, పార్కింగ్, వైద్య, ఆరోగ్యశాఖ అంబులెన్స్ సేవలు, అగ్ని మాపక శాఖ సేవలు, చెరువుల వద్ద గజ ఈతగాళ్ల ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రతీ రోజు ఓ జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, ఈ నెల 21న వేయిస్తంభాల దేవాలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఉర్సుతో పాటు నగరంలోని కాశిబుగ్గ, రంగశాయిపేట, శివనగర్, ప్రాంతాల్లో కూడా ఏర్పాట్లు చేయాలన్నారు. ఉత్సవాల సమయంలో మహిళా సంఘాలచే ఫుడ్ స్టాళ్ల ఏర్పాటు చేయాలని అన్నారు.

మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు బల్దియా ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తామని అన్నారు. సీపీ సత్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. వేడుకలకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, వాహనాల మళ్లింపు, పార్కింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో డీసీపీ సలీమా, డీఆర్‌వో విజయలక్ష్మి, పోలీస్, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రభాకర్‌రావు, ఏసీపీ శుభం ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, పలుశాఖల అధికారులతో పాటు దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ టెండర్లలో ధాన్యం కుంభకోణం

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయ్ టెండర్లలో రూ.1100కోట్ల ధాన్యం కుంభకోణం బయటపడిందని, ఇందులో కాంగ్రెస్ పెద్దల బినామీల ప్రమేయం ఉందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని అన్నారు. ఈ కుంభకోణంపై హైకోర్టులో పిల్ (34/24) దాఖలు చేశామని పేర్కొన్నారు. న్యాయపరమైన విచారణ జరుగాలని డిమాండ్ చేశారు. ఈడీ, సీబీఐ, ఏసీబీలకు 755 పేజీల సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేశామని సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. టెండర్ ఏజెన్సీలపై పూర్తి ఈఎండీ జప్తు చేయకుండా కేవలం రూ.65.90 కోట్లు మాత్రమే వసూలు చేశారని ఆరోపించారు. టెండర్ విలువ కంటే అదనంగా రూ.430 కోట్లు మాయమయ్యాయని ఆరోపించారు. ఈ వ్యవహారం దేశ చరిత్రలోనే అతి పెద్ద కుంభకోణంగా నిలుస్తుందని పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అక్రమాలను కాపాడే ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. నిజాలను బయటపెట్టకపోతే పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

పోక్సో కేసులో నలుగురికి మూడేళ్ల జైలు

వరంగల్ లీగల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలికలను లైంగికంగా వేధింపులకు గురిచేసిన నలుగురికి పోక్సో చట్టం ప్రకారం మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.12వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి కమ్ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి టి.అపర్ణాదేవి బుధవారం తీర్పు చెప్పారు.

బాధితురాలికి రూ.లక్ష పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. వివరాలు ఇలా ఉన్నాయి. వేలేరు మండలం ఎర్రబెల్లి గ్రామానికి చెందిన బాలస్ని తరుణ్, అల్లం రాజులు అదే గ్రామానికి చెందిన పదో తరగతి చదువుతున్న బాలికకు సైగలు చేస్తూ పెళ్లి చేసుకోవాలని వేధించేవారు. ఈ విషయాన్ని నిందితుల తల్లిదండ్రులకు చెప్పగా వారి కొడుకుల చర్యలను సమర్థించారు. పైగా మీ కూతురు ప్రవర్తనే మంచిగాలేదని చెప్పారు. దీంతో బాలస్ని తరుణ్, అల్లం రాజు, వారిని సమర్థించిన అల్లం సమ్మయ్య, అల్లం ఇందిరమ్మలపై బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితులకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.12వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

అభివృద్ధి పనులపై సుదీర్ఘ చర్చ

- మంత్రి పొంగులేటి ఆధ్వర్యంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు
- హాజరైన కలెక్టర్లు, ఇతర అధికారులు
- ప్రస్తావనకు వచ్చిన ఎయిర్‌పోర్టు భూసేకరణ
- స్పోర్ట్స్ స్కూల్ స్థలం, పారిశుధ్య సిబ్బంది నియామకం
- సమావేశానికి మంత్రి సురేఖ దూరం

హనుమకొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కూడా అయిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హనుమకొండ కలెక్టరేట్‌లో బుధవారం ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో వివిధ అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. కలెక్టరేట్‌లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ముగిసిన తర్వాత కలెక్టరేట్ రెండో అంతస్తులోని స్టేట్ చాంబర్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై సమీక్షించారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ఇతర ప్రజాప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సుమారు రెండు గంటల పాటు సుదీర్ఘంగా జరిగిన ఈ చర్చలో హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పాలుపంచుకున్నారు.

భూసేకరణ

మామునూరు ఎయిర్ ఏర్పాటుకు ప్రధాన అడ్డంకిగా ఉన్న భూసేకరణ అంశం ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలిసింది. వీలైనంత త్వరగా భూసేకరణకు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు. విమానాశ్రయం ఏర్పాటయ్యే స్థలంలోనే ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ (ఓహెచ్‌ఎస్‌ఆర్) ఉంది. దీనిని ఎయిర్‌పోర్టుకు దూరంగా ప్రత్యామ్నాయంగా మరో ఓహెచ్‌ఆర్‌ఎస్‌ను సత్వరమే నిర్మించిన తర్వాత ప్రస్తుతం ఉన్న రిజర్వాయర్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి వరంగల్ కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్‌కు సూచించినట్టు తెలిసింది.

స్పోర్ట్స్ స్కూల్

స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని ఉనికిచర్లలో గల ప్రభుత్వ భూమిలో స్పోర్ట్స్ స్కూల్, స్టేడియం నిర్మాణ విషయమై మంత్రి పొంగులేటి సంబంధిత 'కుడా' అధికారులతో చర్చించారు. ఈ స్థల సేకరణ విషయంలో 'కుడా' అధికారులు మోకాలడ్డుతున్నట్టు తెలిసింది. సుమారు 60 ఎకరాల స్థలంలో 'కుడా' వెంచర్ చేయాలని చూస్తోంది. తద్వారా ఆదాయం సమకూర్చుకోవాలని చూస్తోంది. దీంతో ఈ స్థలాన్ని ఇవ్వడానికి 'కుడా' అధికారులు ససేమిరా అంటున్నారు. ఇదే విషయమై సమావేశంలో పాల్గొన్న 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డితో మంత్రి చర్చించారు. ఈ స్థలంలో కొంత భాగం స్టేడియంకు అయినా ఇవ్వాలని సూచించినట్టు సమాచారం. వీలైతే స్పోర్ట్స్ స్కూల్‌ను వర్ధన్నపేట నియోజవర్గ పరిధిలో ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాల్సిందిగా మంత్రి పొంగులేటి సూచించారు.

అదనంగా పారిశుధ్య సిబ్బంది

వరంగల్ నగర పాలక సంస్థలో అదనంగా 250 మంది పారిశుధ్య సిబ్బందిని నియమించడానికి సంబంధించిన అంశం సమావేశంలో చర్చకు వచ్చింది. ఈ ప్రతిపాదనలకు జరుగుతున్న జాప్యాన్ని మేయర్ సుధారాణి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత తర్వాత ఆమోదం తెలపాలని కోరారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువచ్చి పోస్టులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చినట్టు తెలిసింది.

మంత్రి సురేఖ దూరం

ఈ కీలక భేటీకి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ నగరంలో అందుబాటులో ఉన్నప్పటికీ హాజరుకాకపోవడం గమనార్హం. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి, మంత్రికి మధ్య ఇటీవల చోటు చేసుకున్న మాటల యుద్ధం, కొంతకాలంగా ఎమ్మెల్యేలకు, మంత్రికి మధ్య పెరిగిన దూరం నేపథ్యంలో జరిగిన ఈ సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకున్నది. వరంగల్ జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు హాజరైనప్పటికీ మంత్రి సురేఖ రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

విద్యతోనే భవిష్యత్ బంగారు మయం : డీఈవో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే భవిష్యత్ బంగారు మయమవుతుందని జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం వరంగల్‌కు చెందన మాగంటి రామచందర్‌రావు-ఇందిరాదేవి దంపతుల చిన్నకుమారుడు దివంగత విజయచందర్‌రావు జ్ఞాపకార్థం టై, బెల్టులు, కుర్చీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్థికంగా వెనుకబడిన పిల్లలే విద్యనభ్యసిస్తున్నారని, వారిని ప్రోత్సహించేందుకు టై, బెల్టులు, పాఠశాలకు కుర్చీలు అందజేసిన మాగంటి రామచందర్‌రావు-ఇందిరాదేవి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన 6 గురు విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తానని రామచందర్‌రావు ప్రకటించారు. హెచ్‌ఎం సిరినాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏసీజీ మందుల శ్రీరాములు, డీఎస్వో అప్పారావు, ఉపాధ్యాయులు శరిరామ్, భరత్‌వ్యాస్, మాధవి, ప్రతిభ, రామ్‌మోహన్, అశోక్‌రెడ్డి, శ్రీదేవి, కల్యాణి, శోభ, జబర్‌లాల్, పద్మావతి, నాగమణి, దివ్యభారతి, రవీందర్, నరేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


జెండావిష్కరణ చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

కొత్తగూడ, సెప్టెంబర్17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జీఎల్ నగర్‌లో విశ్వకర్మ జయంతిని బుధవారం మండలంలోని విశ్వబ్రాహ్మణులు ఘనంగా నిర్వహించారు. జెండావిష్కరణచేశారు. అన్నదానం చేశారు. మండల అధ్యక్షుడు కంచర్ల సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడునామోజు కృష్ణాచారి, ఉపేంద్రాచారి, మండల కార్యదర్శి రాపాక బ్రహ్మచారి, కోశాధికారి కలుర్లి కృష్ణాచారి, మండల ఉపాధ్యక్షుడు నామోజు కనకచారి, సత్యం, ఉపేంద్రాచారి, రవీంద్రాచారి, శ్రీనివాసచారి, వెంకట నారాయణ, ప్రవీణ్‌చారి పాల్గొన్నారు.

ముమ్మాటికి విద్రోహమే.!

● ఎన్డీ నాయకుడు పుల్లన్న



మాట్లాడుతున్న పుల్లన్న

కొత్తగూడ, సెప్టెంబర్17 (ఆంధ్రజ్యోతి) : 1948 సెప్టెంబరు 17న తెలంగాణ ప్రజలకు జరిగింది ముమ్మాటికీ విద్రోహమే అని ఎన్డీ నాయకుడు పుల్లన్న పేర్కొన్నారు. కొత్తగూడలోని పాలడుగు కృష్ణ స్మారక భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పుల్లన్న మాట్లాడారు. చరిత్రను నిర్మించలేని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ చరిత్రను వక్రీకరించడం అవివేకమని విమర్శించారు. నిజాం నవాబు రజకార్లు పల్లెల్లో సాగించిన క్రూరత్వాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో వీరోచిత పోరాటాలు చేశారని పేర్కొన్నారు. మాజీ జడ్పీటీసీ సువర్ణపాక పుల్లక్క, నాయకులు కాసర్ల లక్ష్మయ్య, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గూడూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండలం బ్రహ్మణపల్లి శివారు ఇప్పల్‌తండాలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. బ్రహ్మణపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయానికి సివిల్‌సప్లై గోదాం నుంచి 70 బస్తాలకు గాను 60 బస్తాల బియ్యం దిగుమతి చేశారు. బియ్యం తీసుకువచ్చిన వాహనదారుడు ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని తన ఇంటికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. వాహనయాజమాని వీరన్న మాత్రం ఇప్పటికి రెండు,మూడుసార్లు తన వాహనాన్ని బియ్యం తీసుకువచ్చేందుకు కిరాయి పెట్టినట్లు పేర్కొన్నారు. ఆ కిరాయి డబ్బుల కింద తనకు బియ్యం ఇవ్వాలని సంబంధిత గురుకుల పాఠశాల నిర్వాహకులను కోరినట్లు చెప్పారు. దీంతో వారు ఇందుకు అంగీకరించినట్లు చెప్పారు. ఈ విషయంపై గురుకుల ఎస్‌వో సునీతను వివరణ కోరగా తాను అందుబాటులో లేనని, మహబూబాబాద్ జీసీడీవో కార్యాలయంలో ఉన్నానని తెలిపారు. ఈ విషయంపై ఆర్‌ఐ షబానను వివరణ కోరగా ఇప్పల్‌తండాలో పట్టుబడిన బియ్యాన్ని ఏపూర్ రేషన్‌డీలర్‌కు అప్పగించినట్లు చెప్పారు. సివిల్‌సప్లై అధికారులు విచారణ చేస్తే పూర్తి వివరాలు వెల్లడవుతాయని చెప్పారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

- 6.94 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. 6.94 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 7.50 మీటర్లు ఉంది.



గార్లలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో మంగమ్మ


కేసముద్రం తహసీల్దార్ ఆఫీస్‌లో జెండా వందనం చేస్తున్న తహసీల్దార్, సిబ్బంది


తొర్రూరులో విద్రోహదినం నిర్వహిస్తున్న సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు

ఊరూరా ప్రజాపాలన దినోత్సవం

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లికుదురు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చంద నరేష్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సీహెచ్.రమేష్‌బాబు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.కుమార్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● కేసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వివేక్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో క్రాంతి, మార్కెట్‌లో చైర్మన్ గంట సంజీవరెడ్డి, ధన్నసరి సొసైటీ వద్ద చైర్మన్ మర్రి రంగారావు, శ్రీవివేకవర్ధిని హైస్కూల్లో కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్, వ్యవసాయ కార్యాలయంలో ఏవో బి.వెంకన్న జాతీయ పతాకాలను ఎగురవేశారు.

● చిన్నగూడూరు మండల పరిషత్‌లో ఎంపీడీవో యాకయ్య, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సంపత్‌కుమార్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ప్రవీన్‌కుమార్, వివిధ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు జెండాను ఆవిష్కరించారు.

● మరిపెడ మండలంలోని అన్ని గ్రామాల్లో జీపీ కార్యాలయాల్లో, పాఠశాలల్లో కార్యదర్శులు, హెచ్‌ఎంలు జాతీయ జెండాను ఎగురవేశారు.

● మరిపెడ మునిసిపల్ కార్యాలయంలో ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణవేణి, మండల పరిషత్‌లో ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, పీహెచ్‌సీలో డాక్టర్ రవినాయక్, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సతీష్‌గౌడ్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మునిసిపల్ కమిషనర్ విజయానంద్, కాంగ్రెస్ నేతలు రఘువీర్‌రెడ్డి, తాజోద్దీన్ పాల్గొన్నారు.

● పెద్దవంగర తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ వీరగంటి మహేందర్, మండల పరిషత్‌లో ఎంపీడీవో వేణుమాధవ్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై క్రాంతికిరణ్, మండల సమాఖ్యలో ఏపీఎం గౌస్, పెద్దవంగర జీపీలో ప్రత్యేక అధికారి శ్రీనివాస్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● నర్సింహులపేట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమేష్‌బాబు, మండల పరిషత్‌లో ఎంపీడీవో రాధిక, పీఏసీఎస్‌లో వైస్ చైర్మన్ బొబ్బ సంజీవరెడ్డి, గ్రామపంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● తొర్రూరులో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్, మండల పరిషత్‌లో వెంకటేశ్వర్లు, వ్యవసాయ మార్కెట్‌లో చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి, పీఏసీఎస్‌లో చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, వివిధ ప్రభుత్వ కార్యాలయంలో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో విద్రోహదినంగా నిర్వహించారు. మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి పాల్గొన్నారు.

● గార్ల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శారద, మండల పరిషత్‌లో ఎంపీడీవో మంగమ్మ జాతీయ జెండాలను ఎగురవేశారు.

● డోర్నకల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, మండల పరిషత్‌లో ప్రత్యేక అధికారి నర్సింహమూర్తి, జడ్పీహైస్కూల్లో హెచ్‌ఎం బండి నర్సింహారావు, సెర్ప్ కార్యాలయంలో ఏపీఎం పాపయ్య, మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ నిరంజన్, డోర్నకల్ సుభాష్ వీధిలో సీపీఎం నాయకులు దాసరి మల్లేశం, బీజేపీ కార్యాలయం వద్ద పట్టణాధ్యక్షుడు దేవాసింగ్‌నాయక్, పెరుమాండ్ల సంకీసలో బీజేపీ జిల్లా నాయకులు గుగులోతు శంకర్‌నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. పెరుమాండ్ల సంకీసలో తెలంగాణ సాయుధపోరాట కుటుంబసభ్యులను శాలువాతో గుగులోతు శంకర్‌నాయక్ ఘనంగా సత్కరించారు.

● బయ్యారంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగరాజు జాతీయ జెండాను ఎగురవేశారు. సీపీఐ మండల కార్యదర్శి సారిక శ్రీనివాస్ ఆధ్వర్యంలో బయ్యారం సెంటర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో విద్రోహదినం పాటించారు. ఈ కార్యక్రమంలో ఏపూరి వీరభద్రం, మురళి, సోమక్క, రాకేష్, ఐలయ్య, జెర్రిపోతుల బుచ్చయ్య, యుగంధర్ పాల్గొన్నారు.

● కొత్తగూడ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజు,మండల పరిషత్‌లో ఎంపీడీవో రోజారాణి, ఎస్సై రాజ్‌కుమార్, ఎంఈవో లక్ష్మినారాయణ, ట్రాన్స్‌కో ఏఈ సురేష్, ఏవో ఉదయ్, జీపీల్లో పంచాయతీ కార్యదర్శులు, పాఠశాలల్లో హెచ్‌ఎంలు జాతీయ జెండాలను ఎగురవేశారు.

● గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగభవాణి, మండల పరిషత్‌లో ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో సీఐ బిక్షపతి, పోలీస్‌స్టేషన్‌లో సీఐ సూర్యప్రకాష్, అటవీశాఖ కార్యాలయంలో ఎఫ్‌డీవో చంద్రశేఖర్, ఎమ్మార్సీలో ఎంఈవో రవికుమార్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● ఇనుగుర్తి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ తరంగిణి, హైస్కూల్లో ఎంఈవో రూపారాణి, మండల పరిషత్‌లో ఎంపీడీవో హరిప్రసాద్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. బీజేపీ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు దుబ్బల సందీప్, కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ పోలెపెల్లి వెంకటేశ్వర్లు, కాల్సాని ప్రభాకర్‌రెడ్డి జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● కురవి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయ, మండల పరిషత్‌లో ఎంపీడీవో వీరబాబు, పోలీస్‌స్టేషన్‌లోఎస్సై గండ్రాతి సతీష్, గ్రామపంచాయతీలోకార్యదర్శి విజయలక్ష్మి, రైతు వేదికలో ఏవో నాగేశ్వర్‌రావు, సీరోలు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పున్నం చందర్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై గండ్ర సంతోష్‌లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

లంబాడీలు భారతదేశ మూలవాసులు

● లంబాడి సంఘాల జేఏసీ నేతలు జగదీష్, కిషన్‌నాయక్

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : లంబాడీలు వలసవాదులు కాదని.. భారతదేశ మూల మూలవాసులని లంబాడి సంఘాల జేఏసీ కన్వీనర్ డాక్టర్ జగదీష్, కోకన్వీనర్ గుగులోతు కిషన్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్‌లోని అంబేద్కర్ సెంటర్ ఈ నెల 28న జరిగే లంబాడీల ఆత్మగౌరవ శాంతి ర్యాలీ కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందే లంబాడీలకు ఓ ప్రత్యేకమైన చరిత్ర ఉందని, అప్పటి నిజాం పాలన కాలంలోనే లంబాడీలు ఎస్టీలుగా గుర్తించబడి ఉన్నారని చెప్పారు. లంబాడీల చరిత్ర తెలియని కొంత మంది వారి వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అన్నదమ్ముళ్ల కలిసిమెలిసి ఉన్న లంబాడీలు, ఆదివాసీ గిరిజన సోదరుల మధ్య చిచ్చుపెట్టి లేని వైరం సృష్టిస్తున్నారన్నారు. వారి కుట్రలను తిప్పికొట్టడానికి లంబాడీల జీవన విధానాన్ని చరిత్రను యావత్ సమాజానికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిసేలా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మానుకోటలో ఈ నెల 28న నిర్వహించే లంబాడీల ఆత్మగౌరవ శాంతిర్యాలీకి వేలాది మంది తరలిరావాలని పిలుపునిచ్చారు. బోడ పృథ్వీరాజ్‌నాయక్, దారవత్ వెంకన్ననాయక్, రాజ్‌కుమార్‌జాదవ్, బోడ రమేష్, గుగులోతు భీమానాయక్, నందులాల్‌నాయక్, హల్యానాయక్, మోతీలాల్, సురేష్, సిద్దు, రవికుమార్, దాము, చందూలాల్, రాంచంద్, బాలాజీ, రాము, శ్రీను, రాందాస్, హరి, మంగీలాల్ పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న లంబాడీ జేఏసీ నాయకులు


కొత్తగూడలో కేక్ కట్‌చేస్తున్న నాయకులు

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

కొత్తగూడ, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజు వేడుకలను కొత్తగూడలో బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి మురళి మాటాడారు. పీఎం మోదీ దేశం కోసం చేసిన సేవలు, దేశ అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాలు పలువురికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు బోనాల ప్రవీణ్‌చారి, వజ్జ రవి, జిల్లా కౌన్సిల్ మెంబర్ వాసం సారయ్య, నాయకులు గుగులోత్ స్వామినాయక్, గంగారపు భిక్షపతి, కొట్టె శ్రీనివాస్, నర్సయ్య, రూప్లానాయక్, రవీందర్, అనిల్, విజయ్ పాల్గొన్నారు.

అద్దె ఇవ్వలేదని జీపీకి తాళం

● సండ్రాలగూడెంలో ఘటన

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం సండ్రాలగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంకు ఇంటి యజమాని అద్దె ఇవ్వలేదని బుధవారం తాళం వేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గత 5 సంవత్సరాల క్రితం గ్రామ పంచాయతీ కార్యాలయంకు ఇల్లు అద్దెకు ఇవ్వడం జరిగింది. మూడేళ్ల అద్దె చెల్లించగా, మరో రెండేళ్ల అద్దె బకాయి రూ. 24 వేలు పెండింగ్‌లో ఉన్నది. పంచాయతీ కార్యదర్శిని అద్దె చెల్లించమని కోరినప్పటికీ ఇవ్వడంలేదన్నారు. విసిగిచెందిన జీపీ కార్యాలయంకు తాళం వేసినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అద్దె బకాయిని తక్షణమే చెల్లించాలన్నారు.

జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కృషి

(5వ పేజీ తరువాయి)

పాత కార్డుల్లో 41,095 మంది సభ్యులను అదనంగా చేర్చడం జరిగిందన్నారు. జిల్లాలో 558 రేషన్ షాపుల ద్వారా రూ.2.70 లక్షల కార్డులకు బియ్యం అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను మెరుగుపర్చడానికి తెలంగాణ విద్యా కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్, జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె.అనిల్‌కుమార్, జిల్లా అధికారులు పురుషోత్తం, మధుసూదనరాజు, వెంకటేశ్వర్లు, హరిప్రసాద్, దక్షిణామూర్తి, పవన్‌కుమార్, మదన్‌గోపాల్, రాఘవరెడ్డి, రాజేశ్వర్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాధమ్మ హత్య కేసును ఛేదించిన పోలీస్‌లు

(5వ పేజీ తరువాయి)

తీసుకెళ్లాడు. హత్యకు ఉపయోగించిన ఇనుపరాడ్డును ఆకేరువాగు ఇసుకలో పాతిపెట్టి, ఇద్దరు స్నానాలు చేసి రక్తపుమరకల దుస్తులను పిండుకొని రాజు బైక్‌పై నెల్లికుదురుకు తిరిగి వచ్చి ఎవరింటికి వారు వెళ్లిపోయారు. రాధమ్మ హత్యకు పాల్పడిన ఉప్పలయ్య, మహేష్‌తో పాటు హత్య అనంతరం వారిని బైక్‌పై తీసుకెళ్లిన రాజుపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చాకచక్యంగా హత్యకేసు ఛేదించిన తొర్రూరు సీఐ గణేష్, నెల్లికుదురు ఎస్సై సీహెచ్. రమేష్‌బాబు పోలీస్‌లు డీఎస్పీ అభినందించారు.

‘రైతులందరికీ యూరియా అందచేస్తాం’

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : యూరియా పంపిణీ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని ప్రతీ ఒక్క రైతుకు యూరియా అందజేస్తామని రాష్ట్ర ప్రభుత్వవిప్ జాటోతు రాంచందర్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ముగిసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం జాప్యం వల్ల యూరియా పంపిణీలో ఇబ్బందులు తలెత్తాయని చెప్పారు. జిల్లాలో పీఏసీఎస్, రైతు వేదికల ద్వారా యూరియా బస్తాలను పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అన్నదాతలు ఆందోళన చెందవద్దని ప్రతి ఒక్క రైతుకు ప్రభుత్వం యూరియాను అందిస్తుందని చెప్పారు. రాష్ట్రానికి కావాల్సినంత యూరియాను తీసుకువచ్చి పోడుసాగు దారులకు కూడా అందిస్తామన్నారు. అనంతరం జిల్లాలో క్షేత్రస్థాయిలో యూరియా పంపిణీ సజావుగా జరిగేలా సేవలందిస్తున్న జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌ను శాలువాలతో సత్కరించారు.


కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌ను శాలువాలతో సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్

మానుకోట పట్టణంలో రైతుల రాస్తారోకో



రైతులతో మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

మహబూబాబాద్ అగ్రికల్చర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వరి పొలం కలుపు నివారణకు మందును పిచికారి చేస్తే ఐదు ఎకరాల వరిపొలం ఎండిపోయిందని ఆ రైతుకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో బుధవారం మహబూబాబాద్‌లో రాస్తారోకో నిర్వహించారు. శనిగపురం శివారు బోడతండాకు చెందిన రాంసింగ్ కౌలుతీసుకున్న ఐదెకరాల పొలంలో కలుపు నివారణ మందును మహబూబాబాద్‌లోని ఎస్‌వి. రాజరాజేశ్వరి ట్రేడర్స్ వద్ద ఖరీదు చేసుకుని తీసుకువెళ్లాడు.

ఆ మందు పిచికారి చేయడంతో ఆ వరిపొలం ఎండిపోయింది. రైతుతో పాటు కొంతమంది రైతులు తెలంగాణ రైతుసంఘం నాయకులను ఆశ్రయించారు. బుధవారం మధ్యాహ్నం షాపు వద్దకు చేరుకుని నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో షాపు యాజమాని ఇవ్వనని బుకాయించడంతో రైతులు రోడ్డుపైకి వెళ్లి రాస్తారోకో నిర్వహించారు. నకిలీ కలుపు నివారణ మందు వల్లనే ఆ రైతుకు చెందిన వరిపొలం ఎండిపోయిందని ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నల్లపు సుధాకర్ డిమాండ్ చేశారు. నకిలీ మందును విక్రయించిన వ్యాపారిపై పీడీయాక్టు నమోదు చేయాలన్నారు. విషయం తెలుసుకున్న సీఐ మహేందర్‌రెడ్డి రైతుల వద్దకు చేరుకుని వారిని శాంతిపచేసి ఆందోళన విరమింప చేశారు. అనంతరం వ్యవసాయాధికారి నారెడ్డి తిరుపతిరెడ్డికి, సీఐ మహేందర్‌రెడ్డి రైతులు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతులు రాములు, లక్ష్మణ్, చిన్న రాములు, గిరి, నాగయ్య, వేణు, శ్రీను, రైతులు పాల్గొన్నారు.


మేడారంలోని సమ్మక్క గుడిలో పూజలు చేస్తున్న పూజారులు

మేడారంలో పెద్దల పండుగ వేడుకలు

- సమ్మక్క గుడిలో ప్రత్యేక పూజలు

తాడ్వాయి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడారంలో సమ్మక్క-సారలమ్మల పూజారులపెద్దల పండుగను బుధవారం జరుపుకున్నారు. ముందుగా వనదేవతల గుడులను శుభ్రం చేసి అలుకు పూత లు చేశారు. రంగురంగుల ముగ్గులు వేసి అమ్మవార్లకు దీపదూప నైవేద్యాలను సమర్పించారు. అదేవిధంగా గ్రామ దేవతలకు పూజలు చేశారు. అనంతరం తమ కుటుంబంలో చనిపోయిన వారిని పెద్దలకు కలపడం కార్యక్రమాలు చేసివారి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. వారి ఆత్మలకుశాంతి చేకూరాలని దేవతలను మొక్కుకున్నారు. పూజారులు, స్థానిక ఆదివాసీలు పాల్గొన్నారు.

రాంచందర్‌నాయక్‌కు డైలీవేజ్ వర్కర్ల వినతి

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీవేజ్, కాంటిజెన్స్ వర్కర్లు బుధవారం ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డైలీవేజ్ వర్కర్లు మాట్లాడుతూ కలెక్టర్ ఉత్తర్వుల మేరకు తమకు సరిపడా వేతనం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉన్న జీతం నుంచే తగ్గించడం సరికాదన్నారు. జీవో 64ను నిలిపివేసి పాత పద్ధతిలో కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను అందించాలన్నారు. తమ సమస్యలు పరిష్కరించేంత నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. యాకూబ్, హలావత్ లింగ్యా, పెనక ముత్తయ్య, వెంకన్న పాల్గొన్నారు.


ప్రభుత్వవిప్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాలల డైలీవేజ్ వర్కర్లు